క్లుప్తంగా

పార్టీ కార్యాలయం ప్రారంభం


వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక కొంగారెడ్డిపల్లె డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఆ పార్టీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి శనివారం ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

ఇంటివద్దనే వైద్య సేవలు


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: వైద్యసేవలు అందించేందుకు ఇంటి వద్దకే వస్తున్నట్లు ప్రాథమిక వైద్యాధికారి సంధ్య అన్నారు. బసవాపల్లె గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సంధ్య మాట్లాడుతూ మంచాన పడ్డ రోగులకు ఇంటివద్దకే వెళ్లి వైద్యం చేస్తున్నట్లు వివరించారు. అనంతరం బీపీ, షుగర్ బాధితులకు, గర్భిణులకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది కోమల, చంద్ర, రోస్‌లిన్, పంకజ, నిత్య పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌లో రూ.1.38లక్షల నగదు సీజ్


సీజ్ చేసిన నగదు చూపుతున్న పోలీసులు

గుడిపాల: మండలంలో తమిళనాడు సరిహద్దులో ఏర్పాటు చేసిన గొల్లమడుగు చెక్‌పోస్ట్‌లో శనివారం వాహనాల తనిఖీల్లో భాగంగా ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న రూ.1.38లక్షలు సీజ్ చేసినట్లు ఎస్ఎస్‌టీ టీమ్ లీడర్ గణపతి తెలిపారు. గొల్లమడుగు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీచేస్తున్న సమయంలో టాటా ఏస్ వాహనం తమిళనాడు నుంచి ఆంధ్ర వైపు వస్తున్నప్పుడు తనిఖీలు చేయగా ఎలాంటి రసీదులు లేకుండా ఒక లక్షా 38వేల 700 రూపాయలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇందులో పోలీస్ సిబ్బంది నాగరాజు, మునిరత్నం, గోపి, శ్రీహరి, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం


షాట్ పుట్ విసురుతున్న జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్: నగరంలో శనివారం న్యాయవాదుల క్రీడా పోటీలను జిల్లా జడ్జి భీమారావు ప్రారంభించారు. న్యాయవాదుల వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా చిత్తూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మెసానిక్ మైదానంలో ఏర్పాటు చేసిన పలు క్రీడా పోటీల్లో న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా జడ్జి భీమారావు షాట్ పుట్, టాగ్ ఆఫ్ వార్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేంద్రనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్ పాల్గొన్నారు.

చిత్తూరు: పార్టీలో చేరిన 28వ డివిజన్ మైనార్టీ నాయకులతో విజయానందరెడ్డి, వైఎస్సార్ సీపీలో చేరిన గుడిపాల వాసులతో విజయానందరెడ్డి





చంద్రబాబుది మాయా కూటమి

- సంక్షేమ పాలన కోసం ఫ్యాను గుర్తుకు ఓటేయండి
- పేదల తలరాతలు మార్చేది జగనన్నే
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి


చిత్తూరు: రచ్చబండ కార్యక్రమంలో స్థానికులతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: చంద్రబాబు మాయా కూటమి వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. స్థానిక 49, 38 డివిజన్లలో శనివారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ, సంక్షేమ పథకాలన్నీ ఇంటికి రావాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. చంద్రబాబును నమ్మి ఓట్లేస్తే, మళ్లీ నట్టేట ముంచేస్తాడని చెప్పారు. జగనన్న సీఎం అయితే పేదల తలరాతలు మారిపోతాయని చెప్పారు. ఏ పదవీ లేనప్పుడే సొంత నిధులతో పలు సేవా కార్యక్రమాలు చేశానన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు మంచి చేయకపోవడంతో టీడీపీ నాయకులను ప్రజలు నమ్మడం లేదన్నారు. వలంటీర్ల సేవలను అడ్డుకుని అవ్వాతాతలకు తీరని అన్యాయం చేసిన చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. మరింత అభివృద్ధి సంక్షేమం అందజేయడానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రెడ్డెప్పను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత తిమ్మసముద్రంలో జరిగిన రచ్చబండలో పలు అంశాలపై స్థానికులతో మాట్లాడారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, కార్పొరేటర్ ఉన్ని, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు రవిచంద్రరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

వైఎస్సార్‌సీపీ నాయకులు బాషాబాయ్ ఆధ్వర్యంలో 29వ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకులు 18 మంది శనివారం పార్టీలో చేరారు. వీరిని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి కండువా వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సయ్యద్‌అలం, కాజాతామిమ్, వసీం, ఉమర్, రియాజ్, అజ్మల్, హకీమ్, సిద్దక్, మున్నా, షఫీ, నజీల్, అబిద్ తదితరులు ఉన్నారు. గుడిపాల పంచాయతీ ఎస్టీ కాలనీకు చెందిన 30 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. దీపక్, దినకర్, వెంకటేష్, ప్రవీణ్, హరి, రవి, సంతోష్, అమ్ములు, రమేష్, సూర్య, వేలు, విక్కీ, సురేష్, రాఘవ, రాజేంద్ర, శివరాజ్, కావేరి, లావణ్య, అలివేలు, రాజమ్మ, కార్తీక, రాసమ్మ, సుమతీ, శశికళ ఉన్నారు.

ఐటీ ఉద్యోగుల ప్రచారం

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లోని ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న నగరవాసులు వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో చిత్తూరులో ప్రచారం నిర్వహించారు. కొంగారెడ్డిపల్లెలో ఇంటింటికీ వెళ్లి జగనన్న హయాంలో జరిగిన మేలును అందరికీ తెలియజేశారు. ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పి.సునీల్‌రెడ్డి మాట్లాడుతూ మళ్లీ సంక్షేమ పాలన కావాలంటే అందరూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి చేస్తున్న సేవ కార్యక్రమాలను తెలియజేశారు. స్థానికంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి చిత్తూరుకు సమీపంలో స్మార్ట్ డీవీ సాఫ్ట్‌వేర్ కంపెనీని ఏర్పాటు చేశారని వివరించారు.






గుడిపాల: 189కొత్తపల్లెలో ఎన్నికల ప్రచారం, వసంతాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం, నారగల్లులో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం

వైఎస్సార్‌సీపీకే దళితుల మద్దతు


చెంగయ్య

చిత్తూరు కార్పొరేషన్: టీడీపీ నాయకులకు ఎప్పుడూ దళితులంటే చులకన అని, దళితుల మద్దతు ఎప్పుడూ వైఎస్సార్‌సీపీకే ఉంటుందని ఐక్య దళిత మహానాడు జాతీయ అధ్యక్షులు కే.చెంగయ్య దుయ్యబట్టారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ గతంలో టీడీపీ నాయకులు పలువురు దళితులకు శిరోముండనం చేసి గ్రామాల నుంచి వెలివేశారని గుర్తు చేశారు. చంద్రగిరి మండలంలో దళిత మహిళలను చెప్పుతో కొట్టడం, ముంగిలిపట్టు గ్రామంలో దళితుడిపై దాడి చేయడం, నారాయణవనం, నాగలాపురం మండలంలో మాదిగలను ఊరి నుంచి వెలివేయడం వంటి ఘటనలు చంద్రబాబు హయాంలోనే జరిగాయని గుర్తు చేశారు. అప్పటి టీడీపీ ప్రజాప్రతినిధులు చింతమనేని ప్రభాకర్, ఆదినారాయణరెడ్డి, త్రిమూర్తులు దళితులను చితకబాదిన ఘటనలు ఎవరూ మరిచిపోలేదన్నారు. దళితుల భూములను ఆక్రమించి ప్రైవేటు సంస్థలకు బాబు అప్పగించలేదా అని అడిగారు. అహంకారానికి నిలువెత్తు నిదర్శనం టీడీపీ అని చెప్పారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో శనివారం సాయంత్రం వచ్చిన గాలీవానతో పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. దీంతో పలు చోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో సరఫరా ఆగిపోయింది. వెంటనే స్పందించిన విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని విరిగిన కొమ్మలను తొలగించి, సరఫరా పునరుద్ధరించారు.

ఉత్తమమైన ఆట చదరంగం


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): మానసిక ఉల్లాసంతో పాటు మానవ మేధస్సును పెంచి శరీరానికి మెదడును సమన్వయపరిచే చదరంగం ఉత్తమమైన ఆట అని లయన్స్ క్లబ్ గోల్డ్ అధ్యక్షులు శ్రీధర్ అన్నారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో శనివారం చదరంగం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల దృష్ట్యా జన విజ్ఞాన వేదిక వేసవి శిక్షణ తరగతులను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు సుధాకర్, అరుణశివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సంస్కారహీనుడు గురజాల


మాట్లాడుతున్న మేయర్ అముద, సరళామేరి

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల ప్రచారంలో ఓట్లు అభ్యర్థించడానికి వచ్చిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ నాయుడు అహంకార ధోరణిని నగర మేయర్ అముద, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సరళామేరి ఖండించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. గుడిపాల మండలం కనికనేరి ఎస్టీ కాలనీలో స్థానికులు సమస్యలు చెప్పుకోవడానికి వస్తే చులకనగా మాట్లాడటం పై దుయ్యబట్టారు. అక్కడి మహిళలు మొగుళ్లను వదిలేశారంటూ నీచంగా మాట్లాడటం సరికాదన్నారు. ఎలాగూ ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసిన టీడీపీ నాయకులు ఆక్రోశంతో ఓటర్లను అహంకార ధోరణితో మాట్లాడుతున్నారని చెప్పారు. గతంలో బాబు దళితులు, క్రిస్టియన్ల గురించి తప్పుగా మాట్లాడారని గుర్తు చేశారు. 2023 వరకు గురజాల ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కరోనా కష్ట సమయంలో వలంటీర్లు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, నాయకులు చేసిన మేలు ప్రజలకు గుర్తు ఉందన్నారు. అధికారంలో లేనప్పుడే ఇలా మాట్లాడితే ఇక అధికారం ఉంటే ఎలా వ్యవహరిస్తారో ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఏ పదవి లేకపోయినా విజయానందరెడ్డి ప్రజలకు మేలు చేశారని గుర్తుచేశారు. ప్రజలు ఆలోచించి మంచి నాయకుడిని ఎన్నుకోవాలని వివరించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ జిల్లా నాయకులు జాషువా, ప్రసాద్, కార్పొరేటర్లు చల్లాముత్తు, బాబు, షర్మిల, భారతి పాల్గొన్నారు.

నీకు ఎస్సీలంటే అంత చులకనా?


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ నాయకులు

గుడిపాల: చిత్తూరు తెలుగుదేశం అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ శనివారం గుడిపాల మండలంలోని పెరుమాళ్లకుప్పం(కనకనేరి)లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో దళిత మహిళలను ఉద్దేశించి పెళ్లిళ్లు చేసుకొని మొగుళ్లను వదిలేస్తారా అంటూ అసభ్యకరంగా మాట్లాడుతూ, వారిపై దురుసుగా ప్రవర్తించాడు. ఈ విషయంపై వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎస్సీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలంటే మీకు అంత చులకనగా కనిపిస్తున్నామా? దళిత మహిళలపై నోరుపారేసుకున్న టీడీపీ అభ్యర్థికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. ఎస్సీల గ్రామాలకు వెళ్లి మరీ అవమానిస్తారా? అంటూ మండిపడ్డారు. కమ్మ సామాజికవర్గం ఉన్న గ్రామానికి వెళ్లి ఏరా, పోరా అని అంటే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. మండలంలో అన్ని గ్రామాలకు వెళ్లి టీడీపీ అభ్యర్థి మాట్లాడిన వీడియోలను అందరికీ చూపించి ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సర్పంచులు రజనీకాంత్, నవీన్, ప్రవీణ్, రాము, పట్టాభి, జయకోడి, గుణవతి, ఎంపీటీసీలు బాబు, యోవాన్, ఎస్సీ నాయకులు కారిమేఘన్, రాజా, సిలంబరసన్ పాల్గొన్నారు.

చిన్న చిన్న తప్పులూ చేయొద్దు


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులు చిన్న తప్పులూ లేకుండా విధులు నిర్వహించాలని చిత్తూరు ఆర్‌ఓ శ్రీనివాసులు ఆదేశించారు. నగరంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు విధులకు కేటాయించిన ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఎన్నికల మాడ్యూల్స్ ను పీఓ, సెక్టోరల్ అధికారులు ఖచ్చితంగా చదివి అర్థం చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సందేహాలుంటే ఉన్నతాధికారులను సంప్రదించాలని చెప్పారు. ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులు ఈ నెల 12వ తేదీ ఉదయం 7 గంటల కల్లా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకుని ఆర్‌ఓకు రిపోర్ట్ చేయాలన్నారు. ఈ నెల 12వ తేదీ రాత్రికి ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. 13వ తేదీ ఎన్నికలు పూర్తయిన వెంటనే ఎన్నికల సామగ్రితో జాగ్రత్తగా రిసెప్షన్ సెంటర్‌లకు చేరుకోవాలని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఏఆర్‌ఓలు అరుణ, శ్రీనివాసులురెడ్డి, సెక్టోరల్ ఆఫీసర్‌లు, రూట్ ఆఫీసర్‌లు పాల్గొన్నారు.

పెనుగాలులకు కూలిన చెట్లు




కొంగారెడ్డిపల్లిలో చెట్టుపడడంతో దెబ్బతిన్న కారు, గుడిపాల వద్ద నేలకొరిగిన వరిపంట

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో శనివారం బలమైన ఈదురుగాలి దాటికి భారీ చెట్లు నేలవాలాయి. సాయంత్రం 4 గంటల సమయంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఉరుములు, మెరుపులకు తోడు ఈదురు గాలుల దాటికి అక్కడక్కడ చెట్లు కూలిపోయాయి. కొంగారెడ్డిపల్లి, రంగాచారి వీధి, ఎన్టీఆర్ బస్టాండు, ఉడిపి, కట్టమంచి తదితర ప్రాంతాల్లో భూమట్టమయ్యాయి. ట్రాఫిక్ స్తంభాలు సైతం కింద పడిపోయాయి. ఆపై అరగంట పాటు వర్షం కురిసింది. ఇన్నాళ్లు ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన జనానికి ఈ వర్షం చల్లదనాన్ని అందించింది. వాతావరణం పూర్తిగా చల్లబడడంతో ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది.

గుడిపాలలో గాలీవాన బీభత్సం

గుడిపాల: మండలంలో శనివారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులు అధికంగా రావడంతో వరి, అరటి, కొబ్బరి, మామిడి చెట్లు విరిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది. మండలంలో చిత్తపార, పాపసముద్రం, పిళ్లారికుప్పం, గుడిపాల, వసంతాపురం, చింతగుంటూరు ప్రాంతాల్లో అధికంగా అరటిపంటలు దెబ్బతిన్నాయి. చిత్తపారలో కొబ్బరిచెట్టు విద్యుత్‌లైన్‌లపై పడడంతో విద్యుత్‌స్తంభాలు విరిగిపోయాయి.

నగరంలో కూలిన వృక్షాల తొలగింపు


పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో శనివారం సాయంత్రం బలమైన గాలులు, వర్షం కురిసిన నేపథ్యంలో మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె.అరుణ నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. కూలిన వృక్షాలను, రోడ్లపై పడిన కొమ్మలను తొలగించాలని కార్పొరేషన్ ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులను అప్రమత్తం చేశారు. కమిషనర్ కొంగారెడ్డిపల్లి, కట్టమంచి, వన్నియర్ బ్లాక్, తిమ్మారెడ్డి సర్కిల్, గాంధీ సర్కిల్ ఎమ్మెస్సార్ సర్కిల్, చామంతిపురం, వివేకానంద సర్కిల్, ఇరువారం తదితర ప్రాంతాల్లో పర్యటించి చెట్లు, కొమ్మలు తొలగించే పనులను పరిశీలించారు. స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా మొక్కలు తొలగించి, శుభ్రత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలకు సంబంధించి అధికారులతో మాట్లాడారు. కమిషనర్ వెంట ప్రజారోగ్య శాఖ అధికారి డా.అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పలు ప్రాంతాల్లో పరిస్థితులను పర్యవేక్షించి పనులను వేగంగా చేయించారు






కొంగారెడ్డిపల్లిలో కూలిన చెట్టు, గుడిపాల: చిత్తపార వద్ద విద్యుత్‌లైన్‌పై పడిన కొబ్బరిచెట్టు, గుడిపాల: వసంతాపురంలో గాలికి విరిగిన మామిడిచెట్టు